సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



శానిటేషన్.. పరేషాన్

ముంపు ప్రాంతాల్లో వందలాది మంది కార్మికులు, వాహనాలతో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నా ఓ కొలిక్కి రావడం లేదు. 8లో



పాలేరు.. నష్టం తీర్చలేరు

చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పాలేరు రిజర్వాయర్‌కు వచ్చిన వరద అన్ని రంగాలకు నష్టాన్ని మిగిల్చింది. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 24°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

భాషా సామర్థ్యాలు పెంపొందించండి



రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డీఈఓ శర్మ, ఉపాధ్యాయులు

వైరా: విద్యార్థుల్లో తెలుగు, హిందీ, ఆంగ్ల భాషా సామర్థ్యాలు పెంపొందించాలని.. తద్వారా వారు పట్టు సాధించేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. వైరాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన బోధన తీరుతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. మాతృభాషపై పాఠశాల స్థాయిలో ఆసక్తిని పెంచాలని సూచించారు. ఆనంతరం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పద్మావతి, అనితాదేవి, భాస్కర్‌రావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డయల్100కు 4,119 ఫోన్లు

ఖమ్మంక్రైం: ఆపదలో ఉన్న వారు సమాచారం ఇచ్చేలా ఏర్పాటుచేసిన డయల్ 100కు గడిచిన ఆగస్టులో 4,119 ఫోన్లు వచ్చాయని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఇందులో మహిళలపై వేధింపులు, చోరీలు, ప్రమాదాలు, అనుమానాస్పద మరణాలు తదితర ఘటనలకు సంబంధించి 91ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశామని వెల్లడించారు. అయితే, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డయల్ 100కు ఫోన్ చేయాలని సీపీ సూచించారు.

జేఏఓలకు ఉద్యోగోన్నతి, బదిలీలు

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్ పరిధిలో పలువురు జూనియర్ అకౌంట్ ఆఫీసర్ల(జేఏఓ)కు అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్లు(ఏఏఓ)గా పదోన్నతి కల్పించడంతో పాటు పోస్టింగ్ ఇచ్చారు. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన జేఏఓలు పలువురు పదోన్నతి పొంది ఇదే జిల్లా పరిధిలో నియమితులు కాగా, ఇంకో ఏడుగురు జేఏఓలను ఖమ్మం సర్కిల్‌కు కేటాయించారు. ఇందులో ప్రభాకర్, జి.లక్ష్మీనర్సింహారావు, వేమన రెడ్డి, జి.రమేష్‌కుమార్, సురేష్, ఈ.శ్రీధర్, కేవీ.జాన్సన్ నూతన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఇక ఇంకో ఇద్దరు యూనియన్ల నాయకులుగా తెలుస్తుండగా వారు ఖమ్మం సర్కిల్‌కు రావడానికి ఇష్టపడక ఎన్పీడీసీఎల్ సీఎండీకి లేఖ ఇచ్చినట్లు తెలిసింది. అలాగే, త్వరలోనే సర్కిల్ పరిధిలో ఎల్ఈసీలకు యూడీసీలుగా, యూడీసీలకు జేఏఓలుగా ఉద్యోగోన్నతి కల్పించనున్నట్లు సమాచారం.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న వెంకటేశ్వర్లు



అవార్డు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్లు

కొణిజర్ల: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన కొణిజర్ల మండలం పెద్దగోపతి జెడ్పీహెచ్‌ఎస్ తెలుగు పండిట్ గొట్టిముక్కల వెంకటేశ్వర్లు గురువారం హైదరాబాద్‌లో అవార్డు స్వీకరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డితో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆయనకు జ్ఞాపిక, అవార్డు అందజేసి సన్మానించారు.

విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా పాఠశాలల్లో ఎల్ఈడీ స్క్రీన్లు సమకూర్చడమే కాకుండా ఫ్యాన్లు, లైట్లు బిగించారు. ఈనేపథ్యాన ఉచిత విద్యుత్ సమకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు తెలంగాణ డిస్కమ్ పోర్టల్ ప్రభుత్వ విద్యాసంస్థల బాధ్యులు లాగిన్ అయితే నెలవారీ బిల్లులు చూడొచ్చని, ఆ వివరాలను విద్యాశాఖ అధికారులకు చేరతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తద్వారా విద్యాశాఖలకు కేటాయించిన బడ్జెట్ నుంచి టీజీ డిస్కమ్‌కు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. తద్వారా స్కూల్ గ్రాంట్ నిధుల నుంచి బిల్లులు చెల్లించే అవసరం తప్పుతుందని, ఆ నిధులను ఇతర అవసరాలకు వాడుకునే వెసులుబాటు లభిస్తుందని చెబుతున్నారు..

వెంకటేశ్వర కాలనీలో ఇంటి పరిస్థితిని తలుచుకుని రోదిస్తున్న మహిళ



కదిలిస్తే కన్నీళ్లే..

మున్నేరు ముంపులో చిక్కుకున్న బాధితులను ఎవరిని కదిలించినా కన్నీటి పర్యంతమవుతున్నారు. సర్వం కోల్పోవడంతో అంతులేని ఆవేదనకు తోడు మరోవైపు ఇళ్లను పూర్వ స్థితికి తెచ్చుకునేందుకు పడుతున్న కష్టాలు చూస్తున్న వారిని సైతం కంట తడి పెట్టిస్తున్నాయి. గృహోపకరణాలు కొట్టుకుపోవడం ఒక ఎత్తయితే.. నేలమట్టమైన ఇళ్లను చూస్తూ నిలువ నీడ లేదని ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలంలోని మున్నేరు వరద బాధితుల్లో ఆక్రందనలు మిన్నంటుతున్నాయి. కూడు, గూడు కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన వారు సాయం కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఎప్పుడు ఎవరొచ్చి ఏం ఇస్తారోనని ఇళ్ల ముందే కళ్లు కాయలు కాసేలా పడిగాపులు కాస్తున్నారు. ఈ ముంపు కంపు నుంచి ఎప్పుడు బయటపడతాం, పూర్వస్థితికి ఎప్పుడు చేరతామోనని తలుచుకుని బాధపడుతున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఓ వైపు వేదన.. మరోవైపు బాధ్యత

- చిన్నారులు, వృద్ధుల ఇక్కట్లు చూడలేకపోతున్న బాధితులు
- వసతుల లేమి, అపరిశుభ్ర వాతావరణంలో ముంపు ప్రాంతాలు
- సర్వం కోల్పోవడంతో సాయం కోసం ఎదురుచూపులు

కట్టుబట్టలు, దుప్పట్ల కోసం..

వరద ప్రభావంతో తేరుకున్న ముంపు ప్రాంతాల ప్రజలు ఐదు రోజులుగా దీనావస్థలో గడుపుతున్నారు. కాలనీల్లోకి దాతలు బట్టలు, దుప్పట్లు పంపిణీ చేయడానికి వస్తే తమకు ఇవ్వాలని వేడుకోవడం చాలా చోట్ల కనిపిస్తోంది. స్వచ్ఛంద సంస్థలు, పార్టీల ఆధ్వర్యాన చేతనైనంత సాయం చేస్తున్నారు. అయితే, ఈ సాయం దేనికీ సరిపోదని ప్రభుత్వం ఇంటిల్లిపాదికి బట్టలు, దుప్పట్లు ఇస్తేనే జీవనం సాగుతుందని చెబుతున్నారు.

అండగా బంధుగణం

మున్నేరు ముంపులో వేలాదిమంది నిరాశ్రయులు కావడం, ఇళ్లలోకి బురద చేరడంతో వారికి చేయూతనిచ్చేందుకు బంధువులు వస్తున్నారు. బంధువులు తమకు తోచిన నగదు, నిత్యావసర సరుకులు ఇస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు ముంపు కంపులో అవస్థ పడుతుండటంతో వారిని తమ ఇళ్లకు తీసుకెళ్తున్నారు. ఇక ఇళ్లను శుభ్రం చేసుకునేందుకు కొందరు కూలీలు ముందుకొచ్చినా రూ.వేలల్లో డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఈ పనిలోనూ బంధువులు అండగా నిలుస్తున్నారు.

ఇప్పట్లో వసతులు వచ్చేనా..

చాలా కాలనీలు బురదతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లగా ఇంకొన్ని ప్రాంతాల్లో మొదలుకాలేదు. పొద్దస్తమానం ఇల్లు, దుస్తులు, సామగ్రిని శుభ్రం చేసుకుంటున్న బాధితులు తాగునీటికి అల్లాడుతున్నారు. కనీసం పిల్లలు తాగేందుకు కూడా నీరు లేనందున ఇంటికొక క్యాన్ తాగునీరు అందించాలని యంత్రాంగాన్ని వేడుకుంటున్నారు. ఇక దాతలు ఇచ్చే సాయం, ప్రభుత్వం ఇచ్చే కిట్లు కొన్ని ప్రాంతాలకే అందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో పనులకు ఆటంకం..

ముంపు కాలనీల్లో బాధితులు, అధికార యంత్రాంగం చేస్తున్న పనులకు వర్షం కారణంగా ఆటంకం ఎదురవుతోంది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు దఫాలు ఓ మోస్తరు వర్షం పడడంతో తడిసిన బట్టలతోనే బాధితులు తమ ఇళ్లను శుభ్రం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మళ్లీ భారీ వర్షం పడి.. వరద వస్తే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక మున్నేటి ఒడ్డుకు సమీపాన ఉన్న కాలనీల్లో వరద బీభత్సం దృశ్యాలు ఇంకా అలాగే కనిపిస్తున్నాయి.

ఇంటింటికీ మందులు..



మున్నేరు లోతట్టు బురదమయమై దుర్వాసన వస్తుండడంతో స్థానికులు ఉండలేకపోతున్నారు. దాతలు భోజనం సమకూర్చినా కాలనీల్లో వాసనతో తినలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇళ్లను శుభ్రం చేసుకుని రాత్రి మళ్లీ పునరావాస కేంద్రానికే వెళ్తున్నారు. ఈమేరకు వైద్య ఆరోగ్య శాఖ ఇంటింటికీ తమ సిబ్బందిని పంపించి బాధితులకు కావాల్సిన మాత్రలను పంపిణీ చేస్తోంది. జ్వరాలు, దురద ఉన్న వారిని మాత్రం జిల్లా జనరల్ ఆస్పత్రి లేదా సమీప పీహెచ్‌సీకి వెళ్లాలని సూచిస్తున్నారు.

మాకేమీ అందడం లేదు..



ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ ప్రాంతం మున్నేటి ఒడ్డునే ఉంది. ఈ ప్రాంతంపై వరద తీవ్ర ప్రభావం చూపింది. బురద తీయడం కూడా సిబ్బందికి కష్టమవుతోంది. ఫలితంగా సామగ్రితో వచ్చే దాతల వాహనాలు కాలనీల్లోకి రావడం సమస్యగా మారింది. రోడ్లన్నీ బురదమయమై ద్విచక్ర వాహనాలు కూడా తిరగడానికి ఇబ్బందిగా ఉంది. దీంతో తమ కాలనీ వైపు ఎవరూ కన్నెత్తి చూడడం లేదని.. ప్రభుత్వం మాటేమో కానీ దాతల సాయం కూడా అందడం లేదని ఈ కాలనీకి చెందిన రెహనాబేగం, తిరుపతమ్మ, సుశీల ఆవేదన చెందారు.

బాధితులకు భరోసా..

- ఐదు రోజులుగా ఖమ్మంలోనే మంత్రి పొంగులేటి
- సహాయక కార్యక్రమాల్లో నిమగ్నం
- మరమ్మతులు, పునరావాసంపై అధికారులకు దిశానిర్దేశం
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల కూడా ఇక్కడే...



ఖమ్మంరూరల్ మండలంలో ముంపు కాలనీల పరిశీలనకు వెళ్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మున్నేరు పరీవాహక ప్రాంతమైన ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలాల్లో దాదాపు 50 కాలనీలకు వరదతో కనీవిని ఎరగని స్థాయిలో నష్టం వాటిల్లింది. ఈ కాలనీల్లోని పలు కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలాయి. ఈనేపథ్యాన జిల్లాతో పాటు సొంత నియోజకవర్గమైన పాలేరులో బాధితులను పరామర్శిస్తూ సహాయక కార్యక్రమాలు వేగంగా సాగేలా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరంతరం పర్యటిస్తున్నారు. బాధితులకు ఆహారం, నిత్యావసర సరుకులు అందేలా పర్యవేక్షిస్తూ భరోసా కల్పిస్తున్నారు.

కాలినడకన.. లేదా బైక్‌పై

వరదల కారణంగా చాలా రహదారులు ధ్వంసమయ్యాయి. కారులో వెళ్తే బాధితులను నేరుగా కలిసే అవకాశం ఉండకపోవడంతో కారు పక్కన పెట్టిన మంత్రి పొంగులేటి చాలాచోట్లకు బైక్‌పైనే వెళ్తున్నారు. ఈక్రమంలోనే ఆయన కాలికి గాయం కాగా చికిత్స చేయించుకుని ఆ వెంటనే సహాయ చర్యల్లో నిమగ్నమయ్యారు.

డిప్యూటీ సీఎం సహా మంత్రులు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరంతరం ప్రజలకు భరోసా కల్పిస్తూనే సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. మరోవైపు జిల్లాలో ముంపు పరిస్థితుల పరిశీలనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా పర్యటించారు. ఓ రోజు రాత్రి ఇక్కడే బస చేసిన ఆయన డిప్యూటీ సీఎం, మంత్రుల సేవలను అభినందించడంతో పాటు సహాయ కార్యక్రమాలపై ఇక్కడే నిర్ణయాలు ప్రకటించారు.

ముంపులో 1.51లక్షల మంది

ఇప్పటివరకు రాష్ట్రంలో 148 గ్రామాల్లోని 1.75 లక్షల మంది వరద ముంపునకు గురికాగా, ఇందులో ఖమ్మం జిల్లాలోనే 79 గ్రామాలకు చెందిన 1.51 లక్షల మంది ఉన్నారు. ఇక రాష్ట్రంలో 13,525 మూగజీవాలు మృతి చెందితే జిల్లాలోనే 12,819 మృతి చెందాయి. పాలేరు నియోజకవర్గంలోని చాలా గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి.

క్షేత్రస్థాయిలోనే..

ఈనెల 1వ తేదీ ఆదివారం తెల్లవారుజాము నుంచే మంత్రి శ్రీనివాసరెడ్డి రంగంలోకి దిగారు. ముఖ్యమంత్రి ఆదేశాలు, సూచనల మేరకు సీఎస్, డీజీపీతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీసీ ద్వారా సూచనలు చేశారు. అప్పటికే పాలేరు నియోజకవర్గంలోని నాయకన్ గూడెంలో ఇటుకలు తయారు చేసుకునే యాకూబ్ కుటుంబం భారీ వరదలో చిక్కుకున్నట్లు తెలుసుకున్న ఆయన పదుల సార్లు వారితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. వాతావరణం అనుకూలించక హెలికాప్టర్లు చేరకపోగా డ్రోన్ ద్వారా లైఫ్ జాకెట్లు, ఆహారం అందించారు. అయినా దురదృష్టవశాత్తు ఆ దంపతులు వరదలో కొట్టుకుపోగా వారి కుమారుడు షరీఫ్‌ను మాత్రం రక్షించగలిగారు. ఇక జిల్లాతో పాటు పాలేరులో పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలిస్తూనే రాష్ట్ర వ్యాప్తంగా వరద ముంపుపై ఆయన విపత్తుల నిర్వహణ అధికారులతో నిరంతరం సమీక్షిస్తున్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపై సూచనలు చేస్తున్నారు. వరదలో కొట్టుకుపోయిన మృతి చెందిన యాకూబ్ దంపతులకు కుమారులకు రూ.10లక్షలు, గంగారంతండాకు చెందిన అశ్విని, ఆమె తండ్రి మృతితో మంజూరైన రూ.10లక్షల చెక్కును కుటుంబాలకు మంత్రి అందజేశారు.

ప్రభుత్వ సాయంతో పాటు మా సాయం కూడా..

ఖమ్మంరూరల్/కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలోని వరద ముంపునకు గురైన వారికి ప్రభుత్వ సాయంతో పాటు పొంగులేటి స్వరాజ్యం – రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పది రోజులకు సరిపడా నిత్యావసర సామగ్రి అందిస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం బైక్‌పై పర్యటించిన ఆయన సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధితుల ఖాతాల్లో శుక్రవారం సాయంత్రం కల్లా రూ.10వేలు జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఆతర్వాత కూసుమంచి మండలంలో పాలేరు వరదలతో సాగర్ ఎడమ కాల్వకు మినీ హైడల్ ప్రాజెక్టు, హట్యాతండా సమీపాన గండ్లు పడగా పూడ్చివేత పనులు చేపట్టడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పరిశీలించారు.

జలవనరుల శాఖ నష్టం రూ.50కోట్ల పైగానే..

ఖమ్మంఅర్బన్: జిల్లాలో భారీ వర్షాల నేపథ్యాన వచ్చిన వరద జల వనరుల శాఖకు తీరని నష్టాన్ని మిగిల్చింది. ఓ వైపు వేలాది కుటుంబాలను ముంచెత్తిన వరద... ఇంకోవైపు అనేక చెరువులు, కాల్వలకు గండ్లు పడడానికి కారణమైంది. జిల్లాలో చెరువులు, కాల్వలకు 90చోట్ల గండ్లు పడి కోతకు గురయ్యాయని అధికారులు గుర్తించారు. ఊహించని రీతిలో వచ్చిన వరదతో చెరువులు నిండి అలుగుల స్థాయిని మించడంతో గండ్లు పడినట్లు చెబుతున్నారు. పాలేరు జలాశయంలో వరద పోటుతో అలుగు పైనుండి ఊహించని విధంగా వరద పారగా, దానిని ఆనుకొని ఉన్న సాగర్ కాల్వలకు సైతం గండ్లు పడ్డాయి. చెరువులు, కాల్వలు, చెక్ డ్యాంలు ఇలా 90ప్రాంతాల్లో గండి పడడంతో మరమ్మతుల కోసం రూ.50 కోట్ల మేర ఖర్చవుతుందని జలవనరులశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ విషయమై వివరాలతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు.

నేడు జిల్లాకు కేంద్ర మంత్రులు

ముంపు ప్రాంతాల్లో పరిశీలించనున్న శివరాజ్ సింగ్, బండి సంజయ్



మాట్లాడుతున్న గల్లా సత్యనారాయణ, పక్కన వినోద్‌రావు తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం/కారేపల్లి: మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం కేంద్ర మంత్రులు పర్యటిస్తారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకుడు తాండ్ర వినోదరావు తెలిపారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్నేటి వరదతో ముంపునకు గురైన కాలనీల్లో శుక్రవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పర్యటిస్తారని తెలిపారు. ఖమ్మం, పాలేరు, మధిరలోని వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించనున్న మంత్రులు బాధితులను పరామర్శించమే కాక కూసుమంచి మండలం జుజ్జుల్‌రావుపేటలో రైతులతో ముఖాముఖి సమావేశమై పంట నష్టాన్ని తెలుసుకుంటారని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కేంద్ర మంత్రుల పర్యటన ఉంటుందని, ఆతర్వాత రోడ్డుమార్గంలో సూర్యాపేట జిల్లాకు వెళ్తారని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు నంబూరి రామలింగేశ్వరావు, దొంగల సత్యనారాయణ, శ్యాంరాథోడ్, నున్నా రవి, నెల్లూరి కోటేశ్వరావు, చావా కిరణ్, రవిరాథోడ్, దిద్దుకూరి కార్తీక్ పాల్గొన్నారు.

డీసీసీబీలో అక్రమాలపై సమగ్ర విచారణ

కొత్తగా రూ.50 లక్షల మేర పంట రుణాలు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని బ్యాంక్ పాలకవర్గ సమావేశం తీర్మానించింది. ఖమ్మంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరగగా పలు అంశాలపై చర్చించారు. రూ.78 లక్షల మేర ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, ప్రోత్సాహకాలు చెల్లించడమే కాక బదిలీలు, పదోన్నతులు, నెలవారీ ఆడిట్ చార్జీల పెంపు, రైతుబీమా టెండర్లలో పాలకవర్గం ప్రమేయం లేకుండా అధికారులు నిర్ణయాలు తీసుకున్నారని డైరెక్టర్లు ఆరోపించారు. ఆయా అంశాలపై సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్, జీఎంలు ఏ.పద్మావతి, కె.నర్మదను సస్పెండ్ చేసినప్పటికీ సమగ్ర విచారణ జరపాలని తీర్మానం చేశారు. అలాగే, రైతులకు రూ.50 లక్షల మేర రుణాలు అందించాలని, ఈ నెల 28వ తేదీన డీసీసీబీ మహాజన సభ నిర్వహించాలని నిర్ణయించారు. కాగా, బ్యాంకులో పనిచేస్తున్న 324 మంది ఉద్యోగుల కుటుంబాల బీమా వ్యవహారాన్ని పరిశీలించాలని కొందరు డైరెక్టర్లు సూచించారు. జిల్లా సహకార అధికారి జి.గంగాధర్, బ్యాంకు సీఈఓ వి.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

తొలి తూటా.. లచ్చన్న దంపతులకే?

4వ తేదీ రాత్రి దోనాల గుట్టల్లో గుడారం

- పక్కా సమాచారంతో చుట్టుముట్టిన పోలీసులు
- గురువారం ఉదయం బయటకొచ్చిన లచ్చన్న, తులసి
- పోలీసులకు ఎదురుపడడంతో ఇరువర్గాల మధ్య కాల్పులు !
- ఆరుగురు మావోయిస్టుల హతం.. తప్పించుకున్న మరో సభ్యుడు



ఘటనాస్థలంలో లభ్యమైన తుపాకులు, తూటాలు, ఇతర పేలుడు పదార్థాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ కరకగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కరకగూడెం ఎన్‌కౌంటర్‌లో తొలి తూటా లచ్చన్న దంపతులకే తగిలినట్టు తెలుస్తోంది. ఆ తర్వాత జరిగిన కాల్పుల్లో దళానికి చెందిన ఇతర సభ్యులు హతమయ్యారు.

అడవుల్లో బాంబుల మోత..

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. తాడ్వాయి మండలం గుండా బుధవారం రాత్రి కరకగూడెం మండలం రఘునాథపాలెం గ్రామానికి సమీపంలో ఉన్న దోనాల గుట్టల దగ్గరికి లచ్చన్న దళం చేరుకుంది. చినుకులు పడుతుండడంతో రాత్రి గుట్టపై బస చేసేందుకు వీలుగా టార్పాలిన్ కవర్లతో గుడారం ఏర్పాటు చేసుకున్నారు. అప్పటికే దళం బస చేసిన స్థలానికి సంబంధించిన సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్నారు. సూర్యోదయం అయిన తర్వాత లచ్చన్న, అతడి భార్య తులసి గుడారం విడిచి బయటకు వచ్చారు. దీంతో ఇరు వర్గాలు ఒకరికొకరు ఎదురుపడటంతో కాల్పులు మొదలైనట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో లచ్చన్న దంపతులే తూటా గాయాలకు ముందుగా ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం. దళ నాయకుడు మృతి చెందడంతో ఒక్కసారిగా ఇతర సభ్యులు అప్రమత్తమై కాల్పులు ప్రారంభించారు. ఈ క్రమంలో మావోయిస్టులు పేలుడు పదార్థాలను ప్రయోగించినట్టు తెలుస్తోంది. సుమారు గంటకు పైగా ఇరు వర్గాల మధ్య భీకర కాల్పులతో అటవీ ప్రాంతం దద్దరిల్లింది. హోరాహోరీ ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా, ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి.

నాలుగైదు రోజులు ఉండేలా..

ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో పరిసరాలను పరిశీలిస్తే మావోయిస్టులు నాలుగైదు రోజులు బస చేసేందుకు వీలుగా పక్కా ఏర్పాట్లతో వచ్చినట్టు అర్థం అవుతోంది. గుడారం ఏర్పాటు చేసుకున్న స్థలంలో బియ్యం, పప్పులు, మంచినీళ్ల సీసాలు, వంట సామగ్రి కనిపించాయి. పోలీసు నిర్బంధం పెరగడంతో అనువైన సమయం చూసుకుని కరకగూడెం మీదుగా గోదావరి దాటి ఛత్తీస్‌గఢ్‌లోకి వెళ్లే ప్రయత్నాల్లో లచ్చన్న దళం ఉన్నట్టు తెలుస్తోంది. అయితే వారు క్యాంపు ఏర్పాటు చేసుకున్న మరుసటి రోజే ఎదురుకాల్పుల్లో మరణించారు. కాగా, మాసయ్య అనే మావోయిస్టు ఈ కాల్పుల నుంచి తప్పించుకున్నాడని పోలీసులు తెలిపారు.

మళ్లీ కోవర్టు భయం

విప్లవ ద్రోహుల వల్లే కరకగూడెం ఎన్‌కౌంటర్ జరిగిందంటూ భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ ప్రకటించడంతో మరోసారి ఏజెన్సీలో ఆందోళన నెలకొంది. కోవర్టు నెపంతో ఇటీవల మావోయిస్టులు హింసాకాండకు దిగుతున్నారు. నీల్సో ఆలియాస్ బంటి రాధను చంపి, చర్ల మండలంలో మృతదేహాన్ని పడేశారు. జిల్లా సరిహద్దులో ఉన్న బీజాపూర్, సుక్మా జిల్లాల్లో కోవర్టు, ఇన్‌ఫార్మర్ నెపంతో ఆరుగురిని హత్య చేశారు. ఇప్పుడు కరకగూడెం ఎన్‌కౌంటర్‌కు కోవర్టులే కారణమనే ప్రకటన మావోల నుంచి రావడంతో ఎప్పుడేం జరుగుతుందో అనే భయాందోళన వ్యక్తం అవుతోంది. మరోవైపు ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక గ్రామస్తుడిని కూడా పోలీసులు చంపారంటూ ఆజాద్ ఆరోపించారు.

మావోయిస్టులపై రివార్డులు ఇలా..

పేరు	రివార్డు (రూ.లక్షల్లో)
లచ్చన్న ఆలియాస్ కుంజా వీరన్న	5
పూనెం లక్కే ఆలియాస్ తులసి	4
కొవ్వాసి రాము	4
దుర్గేశ్	4
పొడియం కోసయ్య	1
ఆలియాస్ సుకురాం కోసి ఆలియాస్ వెన్నెల	1
మాసయ్య	1

ఇంకో దళం ఉందా ?

జూలై 25న గుండాల మండలం దామెరతోగు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు చనిపోయాడు. ఈ సందర్భంగా పోలీసులు జారీ చేసిన ప్రకటనలో దామెరతోగు అడవుల్లో భద్రు, లచ్చన్నతో పాటు 15 మంది మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం ఉందని పేర్కొన్నారు. ఆ తర్వాత పోలీసులు జారీ చేసిన పోస్టర్‌లో లచ్చన్న దళానికి చెందిన ఏడుగురు సభ్యుల ఫొటోలు, వారిపై ఉన్న రివార్డులను పొందుపరిచారు. కరకగూడెం ఎన్‌కౌంటర్‌లో లచ్చన్నతో పాటు మరో ఐదుగురు దళ సభ్యులు మృతిచెందగా.. మాసయ్య తప్పించుకున్నాడు. దీంతో భద్రు దళం, మాసయ్య జాడ ఎక్కడనే అంశంపై చర్చ నడుస్తోంది.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 20మందికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సిఫారసుతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ ముకఎ రూ.5.85 లక్షల విలువైన చెక్కులను ఎంపీ అందజేయగా.. ఆయా కుటుంబాల సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

వేగంగా కిట్ల పంపిణీ

ఖమమమయూరిసెంటర్: ఖమ్మంలో మున్నేరు వరద బాధితులకు ప్రభుత్వం నిత్యావసర సరుకులతో పాటు పాలు, కూరగాయలు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, చీరలు, టవళ్ల పంపిణీ చేస్తోంది. ఈ సామగ్రితో కూడిన పది వేల కిట్లను ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఖమ్మం బొక్కలగడ్డ ప్రాంతంలో ప్రభుత్వ కిట్లను మేయర్ పునుకొల్లు నీరజ పలువురు ముంపు బాధితులకు అందజేశారు. డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు ఎం.డీ.ముస్తఫా తదితరులు ఉన్నారు. ఇక కేఎంసీ కార్యాలయంలో డీఆర్‌డీఏ ఉద్యోగులు రెండు రోజులుగా సామగ్రితో కూడిన కిట్లను సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు.

వీవీసీ ద్వారా బాధితులకు చేయూత



వాటర్‌క్యాన్లు, సామగ్రితో వెళ్తున్న వీవీసీ సంస్థల సిబ్బంది

ఖమ్మంఅర్బన్: మంత్రుల సూచనతో ఖమ్మంకు చెందిన వీవీసీ ట్రస్ట్, వీవీసీ సంస్థల ఆధ్వర్యాన ఖమ్మంలోని ముంపు ప్రాంతాల ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ఇప్పటివరకు రూ.20లక్షల విలువైన ఆహారం, దుస్తులు, తాగునీటితో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు ట్రస్ట్ బాధ్యులు తెలిపారు.

ఖమ్మంకు చేరిన సిద్దిపేట సరుకులు



సిద్దిపేట నుంచి వచ్చిన వాహనాల వద్ద ఎంపీ రవిచంద్ర, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేటి బాధితుల కోసం సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నేతృత్వాన సేకరించిన నిత్యావసర సామగ్రిని అక్కడి నుంచి వాహనాల్లో పంపించారు. ఈ వాహనాలు గురువారం సాయంత్రం జిల్లాకు చేరుకోగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, నాయకులకు బీఆర్‌ఎస్ కార్యాలయంలో సిద్దిపేట నాయకులు సామగ్రిని అందజేశారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు గుండాల కృష్ణ, వేణు, బొమ్మెర రామ్మూర్తి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు రైళ్ల రద్దు

ఖమ్మం రాపర్తినగర్: వర్షాల కారణంగా దెబ్బతిన్న ట్రాక్‌ల మరమ్మతులు కొనసాగుతుండడంతో శుక్రవారం ఖమ్మం మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్లు కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎం.డీ.జాఫర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాజీపేట–డోర్నకల్, డోర్నకల్–విజయవాడకు రెండు మార్గాల్లో ప్యాసింజర్ రైళ్లతో పాటు శాతవాహన, గోల్కొండ, సింహపురి, విశాఖ వందేభారత్, ఇంటర్‌సిటీ రైళ్లు రద్దయిన జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు.

కూలిన ఇంటిగోడ

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం కిష్టారం ఎస్సీ కాలనీలోని మునగాల రాములు ఇంటి గోడలు కూలిపోయాయి. సమీపంలోని సింగరేణి గనుల్లో పేలుళ్లతో ఆయన ఇంటి గోడలు కొన్నాళ్ల క్రితం బీటలు బారాయి. ఇప్పుడు వర్షాలతో మరింత దెబ్బతిని కూలిపోగా కుటుంబీకులు బయట ఉండడంతో ప్రాణాపాయం తప్పింది. ఇకనైనా సింగరేణి యాజమాన్యం స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

గాయపడిన యువకుడు మృతి



సాయిచందర్ (ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు పెట్రోల్‌బంక్ సమీపాన వరదలతో తెగిపోయిన రహదారి గుంతలో పడగా తీవ్రగాయాలైన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మండలంలోని రఘునాథపాలెంకు చెందిన వెన్నమల్ల సాయిచందర్ (27), నీరుడి గోవర్ధన్ బుధవారం మరిపెడకు వెళ్లారు. సాయంత్రం సుబ్లేడు రహదారి మీదుగా వచ్చే క్రమాన రోడ్డు తెగిన ప్రాంతాన్ని గమనించక అందులో పడ్డారు. ఈ ఘటనలో సాయిచంద్‌కు తీవ్రగాయాలు కాగా ఖమ్మంలో చికిత్స అనంతరం హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అయితే, సూర్యాపేట సమీపానికి చేరగానే ఆయన మృతి చెందాడు. ఆయన తల్లిదండ్రులు గతంలోనే మృతిచెందగా పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోదరుడు శ్రావణ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శానిటేషన్.. పరేషాన్

- ముంపు ప్రాంతాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు
- బురద, పాడైన సామగ్రి తొలగిస్తున్నా తరగని గుట్టలు
- ఇలాంటి వరద ఎప్పుడూ చూడలేదంటున్న ఇతర జిల్లాల సిబ్బంది
- నిరంతరం పర్యవేక్షిస్తున్న కేఎంసీ అధికారుల



బొక్కలగడ్డలో జేసీబీతో బురద తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు ముంపు ప్రాంతాల్లో వరద తగ్గి ఐదు రోజులు కావొస్తున్నా పారిశుద్ధ్యం పూర్తి స్థాయిలో మెరుగుపడలేదు. గుట్టలుగా బురద పేరుకుపోవడమే కాక వరద చేరిన ఇళ్లలో పాడైన సామగ్రిని బాధితులు బయట వేస్తున్నారు. దీంతో ఈ చెత్తాచెదారాన్ని తొలగించడం.. డ్రెయినేజీల్లో పూడిక తీయడం కార్మికులకు సవాల్‌గా మారింది. ఈనెల 1న మున్నేరుకు ఒక్కసారిగా వచ్చిన భారీ వరదతో ఎగువ ప్రాంతాల నుండి బురదతో పాటు చెట్లు, కట్టెలు, ప్లాస్టిక్ వ్యర్థాలు కాలనీల్లోని రోడ్లపైకి, ఇళ్లల్లోకి చేరాయి. ఐదు రోజులుగా వందలాది మంది కార్మికులు పని చేస్తున్నా.. పలు కాలనీల్లో మురుగు ఇంకా ఉంది. కొన్ని చోట్ల వ్యర్థాల గుట్టలు కనిపిస్తున్నాయి. వరంగల్, నల్లగొండ కార్పొరేషన్ల కార్మికులతో పాటు జిల్లాలోని పలు పంచాయతీల కార్మికులు ఖమ్మంకు తీసుకురావడంతో పనుల్లో నిమగ్నమయ్యారు.

1,209 మంది కార్మికులతో పనులు

మున్నేటి వరద 13 డివిజన్లలోని పదుల సంఖ్యలో కాలనీలు, వందల సంఖ్యలో వీధులు, ఇళ్లను ముంచెత్తింది. సోమవారం వరద తగ్గడంతో అధికారులు రంగంలోకి దిగారు. భారీగా పేరుకుపోయిన బురద, వ్యర్థాల తొలగింపు కార్మికులకు పెనుసవాల్‌గా మారడంతో అధికారులు కేఎంసీతో పాటు ఇతర ప్రాంతాల నుండి కార్మికులను రప్పించి పనులు చేయిస్తున్నారు. నాలుగో రోజైన గురువారం కేఎంసీకి చెందిన 704 మంది, వివిధ జీపీలకు చెందిన 155 మంది, వరంగల్, నల్లగొండ కార్పొరేషన్ల నుంచి 350 మంది పనుల్లో చేస్తుండగా కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి కొలిక్కి వస్తోంది.

అధికారుల పర్యవేక్షణ

ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో పాటు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వందలాది మంది కార్మికులతో పాటు 28 జేసీబీలు, 48 వాటర్ ట్యాంకర్లు, 60 చెత్త సేకరణ ట్రాక్టర్లు, ఐదు ఫైర్ వెహికిల్స్‌తో పనులు చేయిస్తున్నారు. ఒక్కో వీధిలో పదుల సంఖ్యలో కార్మికులను, వాహనాలను మోహరించారు. ఉదయం 8 గంటలకే కార్మికులు, వాహనాలను చేరుకుంటుండగా సాయంత్రం 6గంటల వరకు పనులు కొనసాగుతున్నాయి.

వేగంగా పారిశుద్ధ్య పనులు



ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేశాం. ఇప్పటికే పలు కాలనీలను శుభ్రం చేయడంతో సాధారణ స్థితికి చేరుతున్నాయి. కేఎంసీకి తోడు ఇతర కార్పొరేషన్లు, జీపీల నుంచి కార్మికులు వచ్చారు. బురద, వ్యర్థాలు తొలగించిన చోట బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

ఇంత వరద చూడలేదు..



వరంగల్‌లో కూడా వరదలు వచ్చాయి. కానీ ఇక్కడ వచ్చినంతగా రాలేదు. ఏ వీధికి వెళ్లినా వరదలతో కొట్టుకొచ్చి పేరుకపోయిన బురద, వ్యర్థాలే కనిపిస్తున్నాయి. రెండు రోజులుగా పనులు చేస్తున్నాం. అంతా బాగుపడాలంటే ఇంకో రెండు, మూడు రోజుల సమయం పట్టొచ్చు.

– కె.లక్ష్మి, పారిశుద్ధ్య కార్మికురాలు, వరంగల్

300 మందిమి వచ్చాం..



ఖమ్మంలో వరద ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల కోసం వరంగల్ నుండి 300 మంది కార్మికులం వచ్చాం. ఇక్కడ వరదతో పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయి పరిస్థితి ఘోరంగా ఉంది. ఎంత వరద వస్తే ఇంత పెద్ద ఎత్తున వ్యర్థాలో పేరుకుపోతాయో ఊహించవచ్చు.

– గన్నారపు జ్యోతి, పారిశుద్ధ్య కార్మికురాలు, వరంగల్

పారిశుద్ధ్య పనులపై కలెక్టర్ ఆరా



రాజీవ్ గృహకల్పలో స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం/కూసుమంచి: మండలంలోని జలగంనగర్, రాజీవ్ గృహకల్ప సమీపాన వరద ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గురువారం పరిశీలిచారు. చెత్తాచెదారం, బురద తొలగించడమే కాక డంప్‌యార్డుకు తరలించాలని ఉద్యోగులకు సూచించారు. అలాగే, రాష్ట్ర ఎస్పీఎం డైరెక్టర్ సురేష్‌బాబు, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ కూడా పలు చోట్ల పరిశీలించి నష్టంపై ఆరా తీయడమే కాక పనులపై సూచనలు చేశారు. ఇక తిరుమలాయపాలెం మండలంలోని రాకాసితండా, కూసుమంచి మండలంలోని పాలేరు తదితర ప్రాంతాల్లో పర్యటించిన అదనపు కలెక్టర్ శ్రీజ పారిశుద్ధ్య పనులు, వైద్య శిబిరాల నిర్వహణను పరిశీలించారు. అలాగే, తిరుమలాయపాలెం మండలం రాకాసితండాలో వైద్య శిబిరాలను డీఎంహెచ్‌ఓ వి.సుబ్బారావు పరిశీలించి దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్‌బాల్స్ వేయాలని, తాగునీటి పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించాలని ఉద్యోగులను ఆదేశించారు.

యుద్ధప్రాతిపదికన గండి పూడ్చివేత పనులు



కాల్వ కట్ట గండిని పూడ్చివేస్తున్న దృశ్యం

కూసుమంచి: మండలంలోని పాలేరు వరద ప్రవాహంతో సాగర్ ఎడమ కాల్వకు మినీ హైడల్ ప్రాజెక్టు వద్ద, హట్యాతండా సమీపాన గండ్లు పడిన విషయం విదితమే. వరద తగ్గుముఖం పట్టడంతో గురువారం నుండి గండ్ల పూడ్చివేత పనులు చేపట్టారు. తొలుత మినీ హైడల్ ప్రాజెక్టు ప్రాంతాన ఏర్పడిన గండిని మట్టితో నింపగా, ఆ తర్వాత కాంక్రీట్‌తో కాల్వను పటిష్ఠం చేయనున్నారు. ఈ పనులను 15 రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఈమేరకు గండి పూడ్చివేత పనులను గురువారం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పరిశీలించారు. అనంతరం పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రాన్ని పరిశీలించి నష్టంపై ఆరా తీశాక పాలేరు వాగు ప్రాంతంలో నీట మునిగిన పొలాలను పరిశీలించిన రైతులకు ధైర్యం చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

బురదలో జారిపడిన మహిళ మృతి



వసంత (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ధంసలాపురం వద్ద మంగళవారం ద్విచక్రవాహనంపై వెళ్తుమున్నేటి వరదతో చేరిన బురద కారణంగా జారిపడడంతో తీవ్రంగా గాయపడిన గుర్రం వసంత(37) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన ఆమె తన నాగేశ్వరరావుతో కలిసి ఖమ్మంలో సుతారి పనులు వెళ్లే సమయాన ఈ ప్రమాదం జరిగింది. ఈమేరకు ఘటనపై ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

న్యాయం చేయాలని మృతదేహంతో ధర్నా

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన వసంత మృతి చెందడంతో గ్రామస్తులు ఆమె మృతదేహంతో గురువారం ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. వరదల కారణంగా మృతి చెందిన వారి మాదిరిగా వసంత కుటుంబానికి కూడా రూ.5 లక్షల పరిహారం చెల్లించి ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గంట పాటు సాగిన ధర్నాతో రెండువైపులా భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్, చింతకాని ఎస్సై నాగుల్‌మీరా చేరుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ధర్నాలో గ్రామానికి చెందిన పగిడిపల్లి ఏసు, రవీందర్, గుడిపాటి నర్సింహారావు, గుంటి హుస్సేన్, యాంపంగి నాగేశ్వరరావు, గద్దల మహేష్, పగిడిపల్లి రమేష్, యాంపంగి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో ఆక్రమణలు తొలగింపు



నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్: హైదరాబాద్‌లో ఆక్రమణదారులను వణికిస్తున్న హైడ్రా తరహాలోనే సత్తుపల్లిలో మున్సిపల్ యంత్రాంగం ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టింది. మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు, టీపీఓ రాజు, ఏఈ సురేష్ తదితరులు గురువారం సాయంత్రం స్థానిక గౌతమ్ స్కూల్ రోడ్డులో డ్రెయినేజీలపై చేపట్టిన నిర్మాణాలను జేసీబీతో కూల్చివేయించారు. ఎన్టీఆర్ నగర్ శివారు నివాసాల సమీపానికి, ఖాళీస్థలాల్లోకి చిన్న వర్షం వచ్చినా వరద చేరుతోంది. దీంతో స్థానికులు ఆందోళనకు దిగడమే కాక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు డ్రెయినేజీలపై నిర్మాణాలతోనే నీరు ముందుకు సాగడం లేదని గుర్తించి జేసీబీతో కూల్చివేయించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ

ఖమ్మంవ్యవసాయం: భారీ వర్షాలు, వరదలతో మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో ఐదు రోజులుగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను గురువారం నాటికి పునరుద్ధరించారు. దానవాయిగూడెం మొదలు, రామన్నపేట, సారధినగర్, మేకల బిక్షమయ్య ఫంక్షన్ హాల్, ఎఫ్‌సీఐ గోదాంలు, కాల్వొడ్డు, బొక్కలగడ్డ, మంచికంటి నగర్, మోతీనగర్, పంపింగ్ వెల్ రోడ్డు, సుందరయ్యనగర్, ప్రకాష్‌నగర్, శ్రీనివాస నగర్ తదితర ప్రాంతాల్లో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ శాఖకు చెందిన ప్రత్యేక బృందాలు మూడు రోజులుగా శ్రమిస్తూ గురువారం నాటికి సరఫరాను పునరుద్ధరించారు. ఎస్‌ఈ సురేందర్ పర్యవేక్షణలో డీఈ నంబూరి రామారావు, ఏడీఈలు నాగార్జున, రమేష్‌కుమార్‌తో పాటు ఏఈలు, సబ్ ఇంజనీర్లు, వివిధ విభాగాల ఉద్యోగులు, కార్మికులు పనుల్లో పాల్గొనగా జలమయమైన దానవాయిగూడెం, ప్రకాష్‌నగర్, పాలేరు(నర్సింహులగూడెం), మధిర సబ్ స్టేషన్లను కూడా నిర్వహణలోకి తీసుకొచ్చారు.

ప్రారంభమైన ఐసెట్ కౌన్సెలింగ్

ఖమ్మం సహకారనగర్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఐసెట్ కౌన్సెలింగ్ గురువారం మొదలైంది. ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న 285మందిలో 254మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారని ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు.

8లోగా పంట నష్టంపై సర్వే

ఖమ్మంవ్యవసాయం: భారీ వర్షాలు, వరదలతో జిల్లాలో దెబ్బతిన్న పంటల నష్టంపై ఈనెల 8వ తేదీ వరకు నివేదికలు ఇవ్వాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించింది. ఇప్పటికే అధికారులు జిల్లాలో 46,374 మంది రైతులకు చెందిన 68,345 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా తేల్చారు. అయితే, ఈనెల 8వ తేదీ నాటికి సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈక్రమంలో పంటలను సర్వే చేస్తున్న అధికారులు వేగం పెంచారు. కాగా, శుక్రవారం కేంద్ర వ్యవసాయ మంత్రి జితేంద్ర సింగ్ తోమర్ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనుండగా, పంటల నష్టంపై హైదరాబాద్‌లో సమీక్షించనున్నట్లు సమాచారం.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కామేపల్లి: అక్రమంగా కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని వాహనంలో తరలిస్తుండగా బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కామేపల్లి ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యాన స్వాధీనం చేసుకున్నారు. కారేపల్లి మండలానికి చెందిన వ్యాపారులు కామేపల్లి మండలంలోని పింజరమడుగు, టేకులతండాలో బియ్యం కొనుగోలు చేసి బొలెరో వాహనంలో తరలిస్తున్నారు. ఈ సమాచారం అందడంతో తనిఖీ చేసి సుమారు 40 క్వింటాళ్ల బియ్యంతో పాటు బొలెరో, ఓ బైక్ స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అదనపు కలెక్టర్ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం?

ఖమ్మం సహకారనగర్: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వాహన డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆయనను కాదని అదనపు కలెక్టర్ పేషీలోని ఓ ఉద్యోగి మరొకరికి విధులు కేటాయించినట్లు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన హరిసింగ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆయన ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

యువకుడి ఆత్మహత్య

కల్లూరురూరల్: కల్లూరులోని ఇంటర్నెట్ సెంటర్‌లో పనిచేస్తున్న ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జూలూరుపాడు మండలం పెద్ద తండాకు చెందిన బోడ భవానీప్రకాష్(25), కల్లూరుకు చెందిన ఎస్.కే.లాల్‌మహ్మద్ కల్లూరులోని ఇంటర్నెట్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. వీరిలో భవానీప్రకాశ్ గదికి బుధవారం రాత్రి 8గంటలకు లాల్‌మహ్మద్ గదికి వెళ్లి చూడగా ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో ఆయన తండ్రి బోడ రాముకు సమాచారం ఇచ్చాడు. ఘటనపై గురువారం రాము ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కల్లూరు ఎస్సై ఎస్.కే.షాకీర్ తెలిపారు. అయితే, భవానీప్రకాశ్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

పాలేరు.. నష్టం తీర్చలేరు..

- గత ఆదివారం ఉగ్రరూపం దాల్చిన రిజర్వాయర్
- 1.65 లక్షల క్యూసెక్కుల వరదతో అతలాకుతలం
- చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా వరద పోటు
- ఇద్దరి మృత్యువాత... అన్ని రంగాలకూ తీరని నష్టం



పాలేరు రిజర్వాయర్ అలుగు ఉగ్రరూపం



కోతకు గురైన జాతీయ రహదారి

కూసుమంచి: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మండలంలోని పాలేరు రిజర్వాయర్ ఉగ్రరూపం దాల్చింది. దీంతో రిజర్వాయర్‌కు గతంలో ఎన్నడూ లేని విధంగా వరద చేరింది. గతం కంటే రెట్టింపుగా వరద ప్రవాహం రావడంతో ప్రజలు అతలాకుతలమయ్యారు. రిజర్వాయర్ గరిష్ట స్థాయి నీటిమట్టం 23 అడుగులైతే గత ఆదివారం అది 30 అడుగులకు దాటేసింది. చరిత్రలోనే ఇదే తొలిసారి అని చెబుతుండగా.. వరద మరింత పెరిగితే రిజర్వాయర్ ట్యాంక్ బండ్ పైకి నీరు చేరి పెనుముప్పు సంభవించేది. కానీ ఒకే రోజులో వరద తగ్గడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే, పరీవాహక ప్రాంతాన్ని ముంచెత్తడంతో కోలుకోలేని నష్టం ఎదురైంది.

1.65లక్షల క్యూసెక్కుల వరద

పాలేరు రిజర్వాయర్‌కు కనీవినీ ఎరుగని రీతిలో ఈసారి 1.65లక్షల క్యూసెక్కుల వరదనీరు చేరింది. 1989లో 98వేల క్యూసెక్కుల వరద రాగా.. ఇదే అత్యధికమని రికార్డులు చెబుతున్నారు. ఎగువన ఉన్న వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుండి భారీగా వచ్చిన వరదతో రిజర్వాయర్ సామర్థ్యమైన 2.5 టీఎంసీలకు పది రెట్లు నీరు చేరగా మిగులు నీరు అలుగుల ద్వారా పాలేరు ఏటిలోకి పారింది. రిజర్వాయర్ గేట్లకు 80 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసే సామర్థ్యం ఉండగా అది రెట్టింపుగా ఉండడంతో పాలేరు గ్రామంతో పాటు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఈ ఉపద్రవంతో పలు ఇళ్లు నీట మునగగా వేలాది ఎకరాల్లో పంటలు కొట్టుకుపోయాయి. ఇక పాలేరు రిజర్వాయర్ వరదనీరు ఇన్‌ఫాల్ కాల్వ మీదుగా వెనక్కి మూడు కి.మీ. వెళ్లగా రంగుల బ్రిడ్జి వద్ద ఇన్‌ఫాల్ కాల్వకు సైతం గండి పడి పంట చేలు నామరూపాలు కోల్పోయాయి.

మునిగిన భక్త రామదాసు... తెగిన కాల్వ కట్టలు

పాలేరు రిజర్వాయర్‌కు వరద పోటుతో ఎర్రగడ్డతండా వద్ద ఉన్న భక్తరామదాసు ప్రాజెక్టుతో పాటు పాలేరులోని మినీ హైడల్ ప్రాజెక్టులు నీట మునిగాయి. దీంతో మోటార్లు జలమయమయ్యాయి. అంతేకాక ప్రాజెక్టు కాల్వ పార్లి పక్కనే ఉన్న విద్యుత్ ఉప కేంద్రం మీదుగా వరదనీరు ఎడమకాల్వలో కలిసింది. ఈనేపథ్యాన పలు గ్రామాల మీదుగా కాలువ పొంగి పొర్లింది. అంతేకాక మల్లాయిగూడెం వద్ద ఎడమ కాల్వ గట్టు తెగి వందలాది ఎకరాల్లో పొలాలు నీటమునిగాయి. ఈ ప్రాంతాన్ని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం పరిశీలించారు.

హైవే కోత... మునిగిన పరిశోధనా కేంద్రం

పాలేరు రిజర్వాయర్ అలుగుల ద్వారా భారీగా వరద పోటెత్తడంతో పాలేరు – నాయకన్‌గూడెం మధ్య సూర్యాపేట పాత రహదారి ధ్వంసమైంది. అంతేకాక నూతనంగా నిర్మించిన ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి సైతం కోతకు గురైంది. ఈ రహదారిపై వంతెన మునిగి ఐదు అడుగుల మేర నీరు ప్రవహించటం గమనార్హం. మరోపక్క పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రంలోకి సైతం వరద చేరగా చేప పిల్లల ఉత్పత్తి యూనిట్లు మునిగాయి. ఈ ఘటనతో రూ.80 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా. పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలోకి సైతం వరద చేరి డార్మెటరీల్లో నీరు నిలవడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. వరదకు ఆయా గ్రామాల మధ్య రహదారులు, కల్వర్టులు ధ్వంసం కాగా రవాణాకు తీవ్ర అంతరాయం కలిగింది.

రూ.కోట్లలో నష్టం

పాలేరు వరదకు నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన షేక్ యాకూబ్, సైదాబీకి ప్రాణాలు కోల్పోయారు. ఇక పంటలు, ఆస్తులు నష్టం విలువ రూ.కోట్లలో ఉంటుందని అంచనా వేస్తున్నారు. పాలేరు ఏటి పరివాహక ప్రాంతంలో పంటలు, విద్యుత్ మోటార్లు నీట మునిగి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాలేరుకు భారీ వరద వచ్చిన కారణంగా నష్టం వెలకట్టలేకుండా ఉందని చెబుతున్నారు.

వరి కొట్టుకుపోయింది...



పాలేరు వరదకు నాలుగున్నర ఎకరాల్లో వరి కొట్టుకుపోయింది. విద్యుత్ మోటార్లు జాడలేకుండా పోయాయి. నాకు సుమారు రూ.4లక్షల నష్టం వాటిల్లింది. ఏం చేయాలో పాలుపోవడం లేదు. పొలం ఇప్పట్లో సాగుకు వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– తేజావత్ వెంకట్, తుమ్మలతండా

ఇంత వరద ఎన్నడూ చూడలేదు...



పాలేరుకు ఇంతటి వరద నేను పుట్టిన నాటి నుంచి చూడలేదు. రిజర్వాయర్‌కు రాత్రికి రాత్రే భారీ వరద రావడంతో గ్రామస్తులం ఎంతో ఆందోళన చెందాం. మునుపెన్నడూ లేనట్లుగా గ్రామంలోకి వరద నీరు వచ్చి ఇళ్లలోకి చేరింది. ఫలితంగా అందరం నష్టపోవాల్సి వచ్చింది.

– గోపే వెంకన్న, పాలేరు

బాధిత రైతులను ఆదుకుంటాం



నీట మునిగిన పత్తి పంటను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మధిర/ఎర్రుపాలెం/ఖమ్మం వన్‌టౌన్: వరదతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా కల్పించారు. మధిర మండలం చిలుకూరు, ఎర్రుపాలెం మండలంలోని మలుగుమాడు, మీనవోలు, పెద్ద గోపవరంల్లో నీట మునిగిన పంటలను ఆయన గురువారం పరిశీలించారు. ప్రకృతి విపత్తుకు రైతాంగానికి భారీగా నష్టం జరిగిందని.. ఈ విషయంలో రైతులను ఆదుకుంటామని తెలిపారు. ఈమేరకు పాడైన పంటల సర్వే త్వరగా పూర్తిచేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సూరంశెట్టి కిషోర్, మల్లాది వాసు, కోనా ధనికుమార్, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, శీలం ప్రతాపరెడ్డి, బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మంలోని మున్నేరు వరద ప్రాంతాలైన బొక్కలగడ్డ(మంచికంటి నగర్)లో పర్యటించిన మంత్రి ప్రభుత్వ సాయం త్వరగా అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.